క్లుప్తంగా

గనిపోతురాజు జాతరకు సన్నాహాలు



కేశవరంలో జాతర విద్యుత్తు దీపాలంకరణ టెండరు ప్రక్రియలో ప్రముఖులు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలం కేశవరం గ్రామ శివార్లలో కనుమ పండుగ రోజు నుంచి నిర్వహించే గని పోతురాజు తీర్థ మహోత్సవాల ఏర్పాట్లను ఆలయ నిర్వాహకులు ప్రారంభించారు. ఆలయ కమిటీ చైర్మన్ కూసు నరసింహమూర్తి, ఈఓ శ్రీనివాసరావు సమక్షంలో జాతర సందర్భంగా విద్యుత్తు దీపాలంకరణకు శుక్రవారం టెండరు ప్రక్రియ నిర్వహించారు. తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడికి చెందిన వ్యక్తి రూ.1.15 లక్షలకు ఈ టెండరును ఖరారు చేశారు. కొబ్బరి చెక్కలు సేకరించుకునే టెండరును జనవరి 5న నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు, నాయకులు కొప్పిరెడ్డి ప్రసాద్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు తుపాకుల ప్రసన్నకుమార్, కొక్కిరి కామేశ్వరరావు, దేవదాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు



జువ్విపాడు చర్చిలో వృద్ధులకు దుస్తులు ఇస్తున్న మాజీ ఎంపీపీ శ్రీనివాస్, పాస్టర్ తదితరులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని ఓదూరు శివారు జువ్విపాడు పెంతెకోస్టల్ చర్చిలో గురువారం రాత్రి క్రిస్మస్ వేడుకలు చర్చి పాస్టర్ రెవరెండ్ పూసల జయప్రకాశ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఓఎన్జీసీ కాకినాడ మేనేజర్ జోజి జాన్ పాల్గొని క్రీస్తు సందేశం వినిపించారు. కేక్ కట్ చేసి భక్తులకు పంచారు. పేదలు, వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బోండా ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ బోండా వెంకన్నరావు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వినకోటి శ్రీనివాస్, నాయకులు వింజుమళ్ల శ్రీనివాస్, ముప్పిడి చినబాబు, ఇసుకపాటి అప్పారావు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



పామర్రులో లబ్ధిదారులకు గ్యాస్ కనెక్షన్లు అందిస్తున్న దృశ్యం

కె.గంగవరం: కేంద్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం పలు పథకాలను అమలు చేస్తుందని వాటిని పేదలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా బీజేపీ నాయకులు కర్రి చిట్టిబాబు అన్నారు. మండలంలోని పామర్రు, అముజూరు గ్రామాల్లో శుక్రవారం వికసిత్ భారత్ కంకల్ప్ యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామ సచివాలయాల వద్ద ఏర్పాటు చేసిన గ్రామ సభలో అధికారులు, బీజేపీ నాయకులు పాల్గొని మాట్లాడారు. చిట్టిబాబు మాట్లాడుతూ అర్హులందరికీ గ్యాస్ కనెక్షన్ ఇవ్వడంతో పాటు సబ్సిడీపై గ్యాస్ సిలిండరేను కేంద్రం అందిస్తుందన్నారు. దీంతో పాటు వైద్య రంగంలో కూడా పేదలకు రాయితీలను, సబ్సిడీపై బియ్యాన్ని అందిస్తుందన్నారు. అనంతరం లబ్ధిదారులకు గ్యాస్ కనెక్షన్లను పంపిణీ చేశారు. ఎంపీడీఓ ఎస్.శ్రీనివాసరావు, తహసీల్దార్ వైద్యనాథ్ శర్మ, సర్పంచ్‌లు వాసంశెట్టి వెంకటదుర్గ, నానాపరపు కళ్యాణి, ఎంపీపీ పంపన నాగమణి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అర్తమూరులో పుంత రోడ్డుకు శంకుస్థాపన



రహదారి నిర్మాణ పనులకు కొబ్బరికాయ కొడుతున్న ఎంపీపీ తదితరులు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలం అర్తమూరులోని ఆదిలక్ష్మి రైస్ మిల్ వద్ద నుంచి గల్లా వారి పొలం వరకూ చేపట్టే పుంత రహదారి నిర్మాణ పనులకు ఎంపీపీ ఉండమట్ల శ్రీనివాస్, జెడ్పీటీసీ సభ్యురాలు కురుపూడి భవాని శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఎంపీపీ శ్రీనివాస్, జెడ్పీటీసీ భవానీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు మాట్లాడుతూ వ్యవసాయ ఉత్పత్తులు తరలింపునకు పుంత రహదారులు ఉపకరిస్తాయన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు పద్మారావు, పార్టీ నాయకులు కురుపూడి రాంబాబు, రైతులు పాల్గొన్నారు.

రమణీయం.. మన సంప్రదాయం

- ముగ్గు ఆచారంతో ముడిపడిన ఆరోగ్యం
- అందుకే ధనుర్మాసంలో అత్యంత ప్రాధాన్యం
- ప్రతి ఇంటి ముంగిటా రంగవల్లుల శోభ



రంగు రంగుల రంగవల్లులు



రాయవరం: ముగ్గు ఆచారం.. ఇంటికి అందం.. అంతకు మించి ఇంటిల్లిపాదికీ ఆరోగ్యప్రదం ..అందుకే కంప్యూటర్ యుగంలోనూ మగువలు ముగ్గులు వేసే సంప్రదాయాన్ని మరవడం లేదు. ధనుర్మాసంలో..సంక్రాంతి సీజన్‌లో ఏ వీధి చూసినా నయనానందకరమైన ముగ్గులు మంత్రముగ్దుల్ని చేస్తుంటాయి. పండగ కోసం అందంగా రంగవల్లులు వేసేందుకు మహిళలు ధనుర్మాసం ప్రారంభం నుంచే సాధన చేస్తారు. ఇరుగు పొరుగు వారి రంగవల్లులను మించి మన ముగ్గే అందంగా ఉండాలనే పోటీతత్వం మగువల్లో కనిపిస్తుంది. జిల్లాలో వివిధ సంస్థలు, సంఘాల వారు సంక్రాంతి పండగ సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తుంటారు. ఈ పోటీలకు మహిళా లోకం నుంచి విశేష స్పందన లభిస్తుంది. సంక్రాంతి పండుగ నేపథ్యంలో ముగ్గులు వేయడం వల్ల కలిగే ఆరోగ్యం.. ఆనందంపై కథనం.

64 కళలలో ఒకటిగా..

మహిళల సృజనాత్మకశక్తికి ప్రతీకగా నిలిచే ముగ్గు 64 కళలలో ఒకటిగా చెబుతారు. ధనుర్మాసంలో అయితే ఈ సందడి మరింత ఎక్కువగా ఉంటుంది. మహిళలు ఎంతో ఉత్సాహంతో ఇళ్ల ముందు రంగవల్లులు తీర్చిదిద్దుతారు. సంక్రాంతి ఇంకా పక్షం రోజులుండగా జిల్లాలో ముగ్గుల సందడి ప్రారంభమైంది. ధనుర్మాసం విష్ణుమూర్తికి ఎంతో ప్రీతికరం. ఈ మాసంలో విష్ణుమూర్తి భూమి మీదకు వస్తాడని భక్తుల నమ్మకం. ఈ మాసంలోనే స్వర్గ ద్వారాలు కూడా తెరుచుకుంటాయని, అందుకే మహిళలు ఉదయాన్నే లేచి ఇంటిని, వాకిలిని శుభ్రం చేసి కళ్లాపి చల్లుతారు. ముగ్గులు వేసేటప్పుడు విష్ణుమూర్తి నామ స్మరణ చేస్తారు.

అందంతో పాటు ఆరోగ్యం..

ముగ్గులు వేయడం వల్ల ఇంటికి అందమే కాదు..వంటికి ఆరోగ్యం కూడా. మన సంప్రదాయంలో ఏ పనిలో అయినా ఆరోగ్య చిట్కా దాగి ఉంటుందని పెద్దలు చెబుతారు. ముగ్గులు వేయాలంటే ఉదయాన్నే లేవడం, నీళ్లను తెచ్చి అందులో పేడ కలిపి చల్లడం, నడుము వంచి ముగ్గులు వేయాలి. ఈ ప్రక్రియలన్నీ శరీరానికి వ్యాయామాన్ని ఇస్తాయి. ఉదయాన్నే లేవడం వల్ల రోజు మొత్తం ఆహ్లాదంగా ఉంటుంది. పేడలోని ఔషధ గుణాలు ఎన్నో రకాల క్రిములను నాశనం చేస్తాయి.

అన్నీ మంచివే..

వేకువజామునే వాకిట్లో గోమయంతో కళ్లాపి చల్లి ముగ్గులు వేస్తారు. గోమయం క్రిమి సంహారి. ఇది మశూచి వంటి వ్యాధులను, దోమలను నివారిస్తుంది. కళ్లాపి చల్లిన తర్వాత వేసే తెల్లటి ముగ్గు పొడి సూక్ష్మజీవులను నశింపజేస్తుంది. పండగ రోజుల్లో బియ్యం పిండితో ముగ్గు వేస్తారు. బియ్యం పిండి పక్షులకు, చీమలకు ఆహారంగా కూడా ఉపయోగపడుతుంది. తద్వారా పుణ్యం వస్తుందనే భావన ఉంది.

సంక్రాంతి అంటేనే ముగ్గులు..



సంక్రాంతి అంటేనే ముగ్గుల పండుగ. పత్రికల్లో వచ్చే ముగ్గులను సేకరిస్తుంటాను. మార్కెట్‌లోకి కొత్తగా వచ్చే ముగ్గుల పుస్తకాలు కూడా కొని అందులో నచ్చిన ముగ్గులు ప్రయత్నిస్తాను. ముగ్గులు వేయడమంటే ఎంతో ఇష్టం. సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించడంలో ముగ్గులు ప్రధాన పాత్ర వహిస్తున్నాయి.

– పంపన మల్లీశ్వరి, విద్యార్థి, ఏడిద, మండపేట మండలం

15 రోజుల ముందు నుంచే..



సంక్రాంతి పండగ వస్తుందంటే నెల రోజుల ముందు నుంచే ముగ్గులు ప్రాక్టీస్ చేస్తుంటాను. అందమైన ముగ్గులు సేకరించి భోగి, సంక్రాంతి పండుగ రోజు వాకిళ్లలో వేస్తుంటాను. అందుకు అవసరమైన రంగులను కూడా సిద్ధం చేసుకుంటున్నాం. ముగ్గుల పోటీలు ఎక్కడ జరిగినా వెళ్తాను. పోటీకి వెళ్తే ప్రైజ్ తప్పనిసరిగా సాధిస్తాను.

– షేక్ సుభాన్‌బీ, గృహిణి, రాయవరం

కోళ్ల సంతకు సంక్రాంతి శోభ



పందెం పుంజుల అమ్మకాలతో సందడిగా మారిన ఆర్యావటం కోళ్ల సంత

కాజులూరు: మండలంలోని ఆర్యావటం సంత మార్కెట్‌లో పందెం కోడిపుంజుల అమ్మకాలు జోరుగా సాగాయి. ప్రతి శుక్రవారం గ్రామంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పక్కన ఉన్న మార్కెట్‌లో కోళ్ల సంత జరుగుతుంది. పరిసర గ్రామాల్లోని మహిళలు, రైతులు నాటుకోళ్లను తీసుకువచ్చి ఇక్కడ అమ్మకాలు నిర్వహిస్తుంటారు. కాకినాడ, రామచంద్రపురం, యానం తదితర పట్టణాల నుంచి పలువురు వ్యాపారులు వీటిని కొనుగోళ్లు చేసి వారి ప్రాంతాలకు తీసుకువెళ్లి అక్కడ మరలా మారు విక్రయాలు చేస్తుంటారు. ప్రతి వారం ఇది పరిపాటిగా జరిగే సంఘటనే. అయితే సంక్రాంతి దగ్గర పడటంతో సందట్లో సడేమియా అన్నట్టు గత రెండు, మూడు వారాలుగా కోళ్ల సంతలో పందెం పుజుల వ్యాపారం హుషారుగా సాగిపోతుంది. సంక్రాంతి వచ్చిందంటే నియోజకవర్గ గ్రామాల్లో కోడి పందాలు జోరుగా సాగుతుంటాయి. దీంతో పందెం పుంజులకు మంచి గిరాకీ ఉండటంతో ఏజెన్సీ ప్రాంతమైన ఏలేశ్వరం, రంపచోడవరం, ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం, ఖమ్మం తదితర ప్రాంతాల నుంచి పలువురు పందెం పుంజులను తీసుకువచ్చి ఇక్కడ విక్రయిస్తున్నారు. కాకి, నెమలి, డేగ, పూల, పచ్చకాకి వంటి జాతుల కోళ్లను ఈ శుక్రవారం సంతలో విక్రయించారు. జాతులను బట్టి ధర రూ.20 వేలు నుంచి రూ.లక్ష వరకూ అమ్మకాలు జరిగినట్టు స్థానికులు చెబుతున్నారు. కోడిపందాల నిర్వహణకు అనుమతి లేకపోయినప్పటికీ కోళ్లకు కత్తులు కట్టనంతవరకూ కేసులు నమోదుకు అవకాశం లేకపోవటంతో పందెం పుంజులు విక్రయించినా పోలీసులు పట్టుకుని కేసులు పెట్టలేకపోతున్నారని స్థానికులు చెబుతున్నారు. అయితే ఇక్కడ కోళ్లసంత నిర్వహణకు పూర్వం నుంచి అనుమతులు ఉండటంతో కోళ్లసంత మాటున పందెం పుంజుల వ్యాపారం సాగిపోవటానికి మరో కారణంగా ఉంది. మరోపక్క కోళ్లసంతలో పందెంపుంజులు విక్రయాలు చూస్తుంటే ఈ సంక్రాంతికి మండల పరిసర గ్రామాల్లో కోడిపందాలు ఏ స్థాయిలో ఉంటాయో అర్థం చేసుకోవచ్చని స్థానికులు అంటున్నారు.



సంతలో పందెంపుంజు పట్టుకుని కొనుగోలుదారుడి కోసం ఎదురు చూస్తున్న యువకుడు

వాకింగ్ ట్రాక్ అభివృద్ధికి చర్యలు

- రూ.15 లక్షలు మంజూరు చేసిన ఎంపీ అనురాధ
- సంతోషం వ్యక్తం చేస్తున్న వాకర్లు

రాయవరం: ఏ వైద్యుడి వద్దకు వెళ్లినా మీరు వాకింగ్ చేయండనే సమాధానం వస్తుంది. ఇటీవల వివిధ కారణాలతో వయస్సుతో నిమిత్తం లేకుండా చాలామంది అనారోగ్యాల పాలవుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ కనబరుస్తున్నారు. ముఖ్యంగా వాకింగ్, యోగా వంటి వాటికి ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ పరిస్థితుల్లో వాకింగ్ ట్రాక్‌లకు ప్రాధాన్యం ఏర్పడుతోంది.

ఎంపీ నిధులతో వాకింగ్ ట్రాక్..

రాయవరం శ్రీరామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాల ఆట స్థలంలోనే వాకర్స్ ఏళ్ల తరబడి వాకింగ్ చేస్తున్నారు. వాకింగ్ ట్రాక్‌ను అభివృద్ధి చేయాలనే ఆలోచన స్థానిక నాయకులకు, వాకర్స్ క్లబ్‌కు వచ్చింది. గతంలోనే ఇందుకోసం వాకర్స్ దాతల నుంచి విరాళాలు సేకరించి గ్రావెల్‌తో అభివృద్ధి చేసి, విద్యుద్దీకరణ చేశారు. ఇదిలా ఉంటే 800 మీటర్ల నిడివి ఉన్న వాకింగ్ ట్రాక్‌ను శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి చేయాలనే ఆలోచన, కోరిక ఎప్పటి నుంచో వాకర్స్ వెలిబుచ్చుతున్నారు. ఇటీవల వాకర్స్ సంఖ్య బాగా పెరిగింది. వాకింగ్ ట్రాక్ వెడల్పు తక్కువగా ఉండడం, వాకర్స్ సంఖ్య పెరగడంతో పలువురు రాయవరం–రామవరం, రాయవరం–వెదురుపాక రహదారులపై వాకింగ్ చేస్తున్నారు. వాకింగ్ ట్రాక్‌ను విస్తరించాల్సిన అవసరం కూడా ఏర్పడిన నేపథ్యంలో గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు తేతల సుబ్బారామారెడ్డి, సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, ఎంపీపీ నౌడు వెంకటరమణ ఆధ్వర్యంలో పలువురు ప్రజాప్రతినిధులు, వాకర్స్ క్లబ్ సభ్యులు ఎంపీ చింతా అనురాధను కలుసుకున్నారు. దీంతో ఎంపీ అనురాధ వాకింగ్ ట్రాక్ అభివృద్ధికి రూ.15 లక్షలు విడుదల చేశారు. ఈ నిధులకు తోడు వాకర్స్, దాతల సహకారంతో వాకింగ్ ట్రాక్‌ను అభివృద్ధి చేస్తున్నారు. వాకింగ్ ట్రాక్‌ను అభివృద్ధి చేయడం పట్ల పలువురు వాకర్స్, గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



రాయవరం శ్రీరామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న వాకింగ్ ట్రాక్ అభివృద్ధి పనులు

గ్యాస్ ఈ–కేవైసీ విషయంలో అపోహలు వద్దు

రామచంద్రపురం రూరల్: ఇటీవల ప్రజల్లో గ్యాస్ సిలిండర్ల కోసం ఈ–కేవైసీ చేయించుకోకపోతే గ్యాస్ సిలిండర్లు ఇవ్వరన్న ప్రచారం ప్రజల్లో నడుస్తోందని ఇది వాస్తవం కాదని రామచంద్రపురం మండల తహసీల్దార్ మైలా వెంకటేశ్వరరావు, ఎంఎస్ఓ షేక్ అహ్మద్ అలీషా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్‌పీ కంపెనీ వినియోగదారుల అడ్రస్ వివరాలను అప్‌డేట్ చేసుకోవడానికి మాత్రమే ఈ–కేవైసీ ప్రక్రియ చేపట్టామన్నారు. కానీ కొందరు ఈ–కేవైసీ చేయించుకుంటే సబ్సిడీ పడుతుందని, సిలిండర్లు అదనంగా ఇస్తారని, ఉచితంగా ఇస్తారని రకరకాలుగా ప్రచారం చేస్తున్నారన్నారు. ఇవేవీ వాస్తవం కాదని ప్రజలు తెలుసుకోవాలని తెలిపారు. ఈ–కేవైసీతో సంబంధం లేకుండా గ్యాస్ సిలిండర్లు ఎప్పటిలాగానే వస్తాయన్నారు. ఈ–కేవైసీ కోసం గ్యాస్ సిలిండర్ డెలివరీ చేసే వారి వద్ద ఉన్న మొబైల్‌లో కూడా అప్‌డేట్ చేసుకోవచ్చన్నారు. లేదా ఆన్‌లైన్ గ్యాస్.ఇన్ లేదా మైఎల్‌పీజీ.ఇన్‌ల ద్వారా చేసుకోవచ్చని తెలిపారు.

ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్ర

కె.గంగవరం: మండలంలోని గ్రామ సచివాలయాల పరిధిలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు శుక్రవారం హుషారుగా జరిగాయి. 7వ సచివాలయల పరిధిలో పురుషులు, మహిళలకు కబడ్డీ, షటిల్, వాలీబాల్ 8 సచివాలయాల పరిధిలో పురుషులకు, మహిళలకు ఖోఖో, కబడ్డీ పోటీలు నిర్వహించారు. పామర్రు, కె.గంగవరం, శివల, యర్రపోతవరం, భట్లపాలిక గ్రామాల్లోని జెడ్పీ ఉన్నత పాఠశాలల్లోని క్రీడా ప్రాంగణాల్లో ఈ పోటీలు జరిపారు. యువత హుషారుగా ఈ క్రీడా పోటీల్లో పాల్గొని గ్రామాల్లో సందడి చేశారు.

పామర్రు వైఎస్సార్ సీపీ నాయకులు వాసంశెట్టి సూరిబాబు, కె.గంగవరంలో ఎంఈఓ నాగరాజు, శివలలో సర్పంచ్ అనుసూరి సాయి, యర్రపోతవరంలో సర్పంచ్ పిల్లి రాంబాబు తదితరులు పోటీలను ప్రారంభించి వీక్షించారు. వారు మాట్లాడుతూ క్రీడలతోనే మానసిక ఉల్లాసం ఉంటుందని చెప్పారు.



పామర్రులో వాలీబాల్ ఆడుతున్న యువత



ద్రాక్షారామలో క్రికెట్ టీమ్ బ్యాట్ అందజేస్తున్న వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి

జోరుగా.. హుషారుగా.. ఆడుదాం ఆంధ్రా..

రామచంద్రపురం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో భాగంగా మండలంలోని ద్రాక్షారామలో పీవీఆర్ క్రీడా ప్రాంగణంలో మంగళవారం కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్ ఆటల్లో మహిళలు, యువతీ, యువకులు జోరుగా, హుషారుగా పాల్గొన్నారు. దీంతో గ్రామంలో సందడి నెలకొంది. వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి టాస్ వేసి, టాస్ గెలిచిన టీం కి బ్యాటింగ్ అప్పజెప్పి క్రికెట్ పోటీలను ప్రారంభించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి వలివేటి సూర్యసుబ్రహ్మణ్యం, వ్యాయామోపాధ్యాయులు గెద్దం అనురాధ, కోశెట్టి శ్రీనివాస్, ఎ.ఉమ, సీహెచ్ సుజాత, తోట నాగమణి, జీవీ గోవిందమ్మలు ఆటల పోటీలను పర్యవేక్షించారు. సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పంట చేను అద్దంలో కొబ్బరందాలు!



ప్రకృతి కాన్వాస్‌పై కొబ్బరి చెట్ల ప్రతిబింబాలు

అలసి సొలసిన భానుడు పశ్చిమాన ఒదుగుతున్న వేళ..పంట చేలో కొబ్బరి చెట్లు తమ ప్రతిబింబాన్ని చూసుకుని మురిసిపోయినట్టుగా ఉందా దృశ్యం. పంట చేను అద్దంలో పచ్చని చెట్లు తమ సోయగాలను చూసుకుంటున్నట్టున్న ఈ దృశ్యం ప్రకృతి ప్రేమికులను అలరించింది. రాయవరం శివార్లలో శుక్రవారం నయన మనోహరంగా ఉన్న ఈ ప్రకృతి చిత్రాన్ని 'సాక్షి' తన సెల్ కెమెరాలో బంధించింది.

– రాయవరం

వీఆర్వోపై దాడి అభియోగంపై కేసు

రామచంద్రపురం రూరల్: విధుల్లో ఉన్న తనపై దాడి చేశారని వీఆర్వో చేసిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు ద్రాక్షారామ ఎస్సై జి. సురేంద్ర శుక్రవారం విలేకరులకు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ద్రాక్షారామ వీఆర్వో కె.సాయిబాబు శుక్రవారం గ్రామ సచివాలయంలో ఎండీయూ ఆపరేటర్లు, వలంటీర్లతో సమావేశంలో ఉండగా, అదే గ్రామానికి చెందిన నరాల రవి కర్నేలు అనే యువకుడు ఇంటి పన్ను, కరెంటు బిల్లు అధికంగా వచ్చిందని వీఆర్వోను కలిసి తెలిపాడు. అది తన పని కాదని బిల్లు కలెక్టర్‌ను కలవాలని చెప్పడంతో పంచాయతీ వద్దకు వెళ్లి తిరిగి వచ్చి అక్కడ ఎవరూ లేరని చెప్పాడు. వీఆర్వో స్పందించి సమావేశం ముగిసిన తరువాత మాట్లాడతానని రవి కర్నేలుకు చెప్పాడు. దాంతో ఆగ్రహించిన అతడు తనపై దాడి చేసి గాయపరిచినట్లు, ఎండీయూ ఆపరేటర్లు, వలంటీర్లు తనను అతని బారి నుంచి కాపాడినట్లు వీఆర్వో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

మట్టి ఖర్చుల అందజేత



బీమా సాయాన్ని అందజేస్తున్న సర్పంచ్

కపిలేశ్వరపురం (మండపేట): కపిలేశ్వరపురం మండలం మాచర గ్రామానికి చెందిన కడలి శ్రీనివాసు కిడ్నీ సంబంధిత వ్యాధితో మృతి చెందాడు. అతని కుటుంబానికి డాక్టర్ వైఎస్సార్ బీమా సాయం మంజూరైంది. తక్షణ సాయంగా రూ.10 వేలను నామినీగా నమోదైన మృతుని మేనల్లుడు రాయుడు రాజా కల్కి కనకదుర్గా ప్రసాద్‌కు సర్పంచ్ వాసంశెట్టి సునీత చేతుల మీదుగా శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ వీరాంజనేయ, వైఎస్సార్ సీపీ గ్రామశాఖ అధ్యక్షుడు వాసంశెట్టి విష్ణుమూర్తి, నాయకులు రాయుడు జగపతి రామయ్య, పాల్గొన్నారు.

సీఎం పర్యటనను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న పెద్దాపురం డీఎల్‌డీఓ కేఎస్‌వీ ప్రసాదరావు

కాజులూరు: జిల్లా కేంద్రమైన కాకినాడలో జనవరి మూడో తేదీ బుధవారం జరగనున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేసేందుకు అధికారులు, నాయకులు కృషి చేయాలని పెద్దాపురం డీఎల్‌డీఓ కేఎస్‌వీ ప్రసాదరావు అన్నారు. సీఎం టూర్ పరిశీలనాధికారిగా కాజులూరు ఎంపీపీ కార్యాలయంలో శుక్రవారం మండల స్థాయిలోని వివిధ శాఖల అధికారులతో ప్రసాదరావు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. వృద్ధాప్య, వికలాంగ, వితంతు పింఛన్లు రూ.3 వేలు పెంపు కార్యక్రమం ప్రారంభించేందుకు, పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కాకినాడ వస్తున్నారన్నారు. మండల గ్రామాల నుంచి సభకు వచ్చే అభిమానులకు, ప్రజలు వసతుల ఏర్పాట్లలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా నాయకులు, అధికారులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రత్నరాజు, ఈఓపీఆర్డీ సీహెచ్ ఇందిరాదేవి, డ్వాక్రా ఏపీఎం అనిల్‌కుమార్, ప్రసాద్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రహదారికి భూమి పూజ



రహదారి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న చైర్ పర్సన్ దుర్గారాణి

కపిలేశ్వరపురం (మండపేట): మున్సిపల్ సాధారణ నిధులు రూ.16 లక్షలతో పట్టణంలోని 20వ వార్డు పరిధిలో నిర్మించే సీసీ రహదారికి మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్సార్ కాలనీలో దాదాపు అన్ని రహదారుల నిర్మాణాలు మెరుగు పర్చాయన్నారు. ప్రాధాన్యతా క్రమంలో పట్టణాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, రాష్ట్ర షేక్ అండ్ షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ అలీఖాన్‌బాబా, కౌన్సిల్ విప్ పోతంశెట్టి ప్రసాద్, ఏఎంసీ డైరెక్టర్ షేక్ మస్తాన్, పార్టీ నాయకులు గండి నాగేశ్వరరావు, పాలంగి కమల, సచివాలయ కన్వీనర్లు, ఏఈ కె.సత్యనారాయణ, సచివాలయ కార్యదర్శి సూరిబాబు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పారిశుధ్య కార్మికుల సమ్మె

కపిలేశ్వరపురం (మండపేట): తమ డిమాండ్ల సాధనకు మండపేట పారిశుధ్య కార్మికులు చేపట్టిన సమ్మె శుక్రవారం నాలుగో రోజుకు చేరుకుంది. వారి దీక్షా శిబిరాన్ని సీఐటీయూ అనుబంధ రవాణా, అంగన్‌వాడీ, ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు సందర్శించి సంఘీభావం తెలిపారు. సమస్యలను పరిష్కరించే వరకూ ఆందోళనను కొనసాగిస్తామని సీఐటీయూ నాయకులు తెలిపారు.

అంగన్‌వాడీల డిమాండ్లు పరిష్కరించాలి

కపిలేశ్వరపురం (మండపేట): దీర్ఘకాలంగా క్షేత్రస్థాయిలో పోషకాహారాన్ని అందిస్తూ సేవలందిస్తున్న అంగన్‌వాడీల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.కృష్ణవేణి కోరారు. మండపేట మున్సిపల్ కార్యాలయం ఎదుట మండపేట, కపిలేశ్వరపురం, రాయవరం మండలాలకు చెందిన అంగన్‌వాడీల దీక్షా శిబిరంలో శుక్రవారం కృష్ణవేణి మాట్లాడారు. న్యాయమైన వారి డిమాండ్లను పరిష్కరించే దిశగా ప్రభుత్వం ఆలోచన చేయాలన్నారు. 18 రోజులుగా కొనసాగుతున్న దీక్షకు ప్రజాతంత్ర శక్తులన్నీ మద్దతు పలుకుతున్నాయన్నారు.

శిరోముండనం బాధితులకు న్యాయం చేయాలి

రామచంద్రపురం రూరల్: వెంకటాయపాలెం శిరోముండనం సంఘటన జరిగి ఈ నెల 29 నాటికి 28 ఏళ్లు పూర్తయినా బాధితులకు న్యాయం అందని ద్రాక్షగానే మిగిలిందని, వారికి న్యాయం ఇంకెప్పుడు అని దళిత ఐక్య పోరాట వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం ఆవేదన వ్యక్తం చేశారు. 28 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ద్రాక్షారామలోని కామ్రేడ్ గుర్రాల పరంజ్యోతి స్మారక గ్రంథాలయంలో సమావేశం నిర్వహించారు. బాధితులకు కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని, వారికి సత్వర న్యాయం జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు. శిరోముండనం బాధితుడు చల్లపూడి పట్టాభిరామయ్య, ఐక్య వేదిక కన్వీనర్ వెంటపల్లి భీమశంకరం, సభ్యులు వి.రామకృష్ణ, గుబ్బల శ్రీను, బి.సిద్ధూ, అంబటి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.